
# బీఆర్ఎస్ పాలనలోనే యువతకు భవిత

- సీఎం కేసీఆర్ దూరదృష్టి కలిగిన గొప్ప నేత
- పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్
- గులాబీ పార్టీలో యువకుల చేరిక

మంథని, అక్టోబర్ 12: బీఆర్ఎస్ పాలనలోనే యువత ఉజ్వల భవిష్యత్‌కు భరోసా లభిస్తుందని పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ అన్నారు. సీఎం కేసీఆర్ దూరదృష్టి కలిగిన గొప్ప నాయకుడని కొనియాడారు. మంథని నియోజకవర్గం మహాముత్తారం మండలానికి చెందిన పంగ సురేశ్, పంగ దేవేందర్, కొయ్యాల మహేందర్, మంథెన లవకుమార్, మంథెన రాజబాపు, రామిల్ల వంశీ, ఆసంపెల్లి లచ్చయ్య, కొండ మల్లయ్య, మారపాక పోచయ్య, గంధం రాజబాపు, గోపాల్‌పూర్‌కు చెందిన పిడుగు పెద్ద కొమురయ్య మరో 20 మంది యువకులు గురువారం బీఆర్ఎస్‌లో చేరారు. వీరికి మంథని రాజగృహలో మధూకర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిదేండ్లలో ఎమ్మెల్యేగా, జడ్పీ చైర్మన్‌గా నియోజకర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేశానని చెప్పారు. యువతకు ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. కానీ 40 ఏండ్లుగా అధికారం వెలగబెడుతున్న కాంగ్రెస్ ప్రజలకు చేసిందేమీలేదని ధ్వజమెత్తారు. అండగా నిలిచేవారెవరో..అవినీతికి పాల్పడేవారెవరో ఆలోచించి ఓటేయాలని కోరారు.

# కోరుట్ల విద్యార్థులకు ప్రధాని మోదీ లేఖ

- పరీక్ష పే చర్చలో పాల్గొన్నందుకు అభినందనలు



కోరుట్ల: ప్రధాని మోదీ పంపిన లేఖ

కోరుట్ల, అక్టోబర్ 12: పరీక్ష పే చర్చలో పాలు పంచుకున్న జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధాని మోదీ లేఖ రాశారు. పరీక్షల ముందు చిన్నారుల్లో ఒత్తిడి పోగొట్టేందుకు ప్రతి ఏడాది నిర్వహిస్తున్న పరీక్ష పే చర్చ కార్యక్రమంలో ఇటీవల కోరుట్ల ప్రభుత్వ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు, ఫిజికల్ సైన్స్ టీచర్ నాగరాజు 'మై గావ్ యాప్' ద్వారా తమ అభిప్రాయాలు, సూచనలు, ప్రశ్నలు సందించారు. ఇందులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ నుంచి ఫిజికల్ సైన్స్ టీచర్ పేరుతో లేఖ గురువారం పాఠశాలకు చేరింది. ఇందులో పరీక్షా పే చర్చ కార్యక్రమంపై 'మీ నుంచి ఉపాధ్యాయ మిత్రుల నుంచి వచ్చిన అభిప్రాయాలను తెలుసుకోవడం చాల సంతోషంగా ఉంది. అందుకు గాను మీకు ధన్యవాదాలు, దేశం, విద్యార్థుల అభివృద్ధి కోసం మీ అభిప్రాయాలు చాలా విలువైనవి' అని ప్రధాని అభినందనలు తెలిపారు. 'మీ ఆలోచనలను పంచుకున్నందుకు మరోసారి ధన్యవాదాలు. మంచి ఆరోగ్యం సంతోషకరమైన భవిష్యత్తు కోసం శుభాకాంక్షలు' అంటూ ప్రధాని మోదీ లేఖలో రాసుకొచ్చారు.

# ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇవ్వండి..



హుజూరాబాద్ 7వ వార్డులో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

- నియోజకవర్గాన్ని రూ. వెయ్యి కోట్లతో అభివృద్ధి చేసి చూపిస్తా
- బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్‌టౌన్ అక్టోబర్12: ఒక్కసారి ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇవ్వాలని, హుజూరాబాద్ నియోజకవర్గాన్ని రూ.వెయ్యి కోట్ల నిధులు తెచ్చి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి చూపిస్తానని మండలి విప్, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాత్రి హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలోని ఐదు, ఆరు, ఏడు, ఎనిమిది వార్డుల్లో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రతి కార్యకర్త బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యేగా గెలిపిస్తే హుజూరాబాద్‌ను మరో సిద్దిపేట, సిరిసిల్ల మాదిరిగా అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. పలుమార్లు ఈటలకు అవకాశం ఇచ్చినా నియోజకవర్గాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేదని విమర్శించారు. తనను ఒక్కసారి గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏంటో నియోజకవర్గ ప్రజలకు చేసి చూపిస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధికాశ్రీనివాస్, వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, బీఆర్ఎస్ పార్టీ పట్టణాధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, ఆయా వార్డుల కౌన్సిలర్లు అపరాజ ముత్యంరాజు, తాళ్లపల్లి శ్రీనివాస్, మక్కపెల్లి కుమార్, బీ శివకుమార్, మాజీ కౌన్సిలర్ కొయ్యడ కమలాకర్, మాజీ ఎంపీటీసీ కొయ్యడ శ్రీదేవి, వార్డు కమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంక్షేమమే మన ఎజెండా

- అభివృద్ధిని ఇంటింటా వివరించాలి
- ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు
- జగ్గాసాగర్‌లో మండల ముఖ్య కార్యకర్తల సమావేశం
- ఆశీర్వదించండి.. అండగా ఉంటా : కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల


మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి రూరల్, అక్టోబర్ 12: సంక్షేమమే మన ఎజెండా కావాలని, సీఎం కేసీఆర్ నాయకత్వంలో అమలవుతున్న పథకాలే అస్త్రాలుగా ప్రచారంలో ముందుకు సాగాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు సూచించారు. గురువారం జగ్గసాగర్‌లో మెట్‌పల్లి మండల బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం పార్టీ మండలాధ్యక్షుడు నల్ల తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ నాలుగుసార్లు తనను ఎమ్మెల్యేగా గెలిపించారని, ప్రస్తుతం కోరుట్ల ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న తన కొడుకు డా. సంజయ్‌ను సైతం ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకం ఏదో ఒక రూపంలో ప్రతి ఇంటికి చేరిందన్నారు. ఆసరా, బీడీ కార్మిక, ఒంటరి మహిళ, వితంతు పింఛను, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా, కేసీఆర్ కిట్ తదితర సంక్షేమ పథకాలు బీఆర్ఎస్ విజయంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. సంక్షేమంతో పాటు గత తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులను సైతం ప్రతి ఇంటింటికీ తిరుగుతూ వివరించాలని సూచించారు. ఏ గ్రామంలో ఎంత అభివృద్ధి జరిగింది..? ఎవరెవరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయన్న వివరాలను సైతం అందజేస్తామని, వీటిని ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నల్ల తిరుపతిరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గడ్డం రాజారెడ్డి, పార్టీ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు గొర్రె పుష్ప, రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు గడ్డం రాంరెడ్డి, నాయకులు ముదాం నర్సింలు, డాకూరి వెంకటేశ్, పుల్ల జగన్‌గౌడ్ పాల్గొన్నారు.

### ఆశీర్వదించండి.. అండగా ఉంటా



నేను మీ మనిషిని. నన్ను కోరుట్ల ఎమ్మెల్యేగా గెలిపించండి. మీకు అన్ని విధాలుగా అండగా ఉంటా. ఆరు దశాబ్దాల్లో జరగని అభివృద్ధి సీఎం కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేళ్లలో జరిగింది. గడపగడపకూ సంక్షేమ ఫలాలు చేరాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించండి. కాంగ్రెస్, బీజేపీ అసత్యపు ప్రచారాలను తిప్పికొట్టండి. నేను గెలిస్తే యువతకు స్థానికంగా ఉపాధి కల్పిస్తా. నియోజకవర్గంలో పరిశ్రమలను స్థాపించేందుకు కృషి చేస్తా.

**- డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి**

# సుపారీ ఇచ్చి భర్తను హతమార్చింది

- ప్రవీణ్ హత్య కేసులో వీస్తుగొలిపే వాస్తవాలు

ఫర్టిలైజర్‌సిటీ, అక్టోబర్ 12: గోదావరిఖని మార్కండయకాలనీకి చెందిన కొచ్చర ప్రవీణ్ హత్య కేసులో వీస్తుపోయే వాస్తవాలు వెలుగులోకి వస్తున్నాయి. రూ. 5 లక్షల సుపారీ ఇచ్చి భార్య అతడిని హతమార్చినట్లు పోలీసుల విచారణలో తేలింది. ప్రవీణ్ మరో మహిళలతో చనువుగా ఉండడం, అతడు రియల్ ఎస్టేట్ ద్వారా సంపాదించిన నగదును ఆమెకు ఖర్చుపెడుతున్నట్లు అనుమానంతో భార్య లలిత.. ప్రవీణ్‌ను హతమార్చాలని పథకం పన్నింది. ప్రవీణ్ రియల్ ఎస్టేట్ సంస్థలో సెంట్రింగ్ మేస్త్రీగా పనిచేసే రామగుండానికి చెందిన మచ్చ సురేశ్ సహకారంతో హత్యచేసినట్లు చేసినట్లు సమాచారం. సురేశ్‌కు ఒక ప్లాంటు, రూ. 5లక్షల నగదు ఇస్తానని ఒప్పందం భార్య ఒప్పందం కుదుర్చుకున్నది. నిందితుడికి మూడు తులాల బంగారు పుస్తెల తాడును అందజేసింది. అలాగే ఈ హత్యలో సురేశ్‌తో పాటు రామగుండానికి చెందిన మరో వ్యక్తి, మందమర్రికి చెందిన మరో ముగ్గురు పాలుపంచుకున్నట్లు సమాచారం. పథకం ప్రకారం మంగళవారం తెల్లవారుజామున ఇంట్లో నిద్రిస్తున్నట్లుగా భార్య లలిత సురేశ్‌కు సమచారం ఇచ్చింది. వారు ఇంటికి వచ్చి దిండుతోనే ముఖ్యంపై నొక్కి శ్వాస అడకుండా హతమర్చినట్లు తెలిసింది. లలిత నిద్రలో నుంచి మేలుకొని దవాఖానకు తరలించి గుండెపోటుగా చిత్రీకరించేందుకు యత్నించింది. అనుమానం వచ్చిన మృతుడి సోదరుడు, కేంద్ర సాయిధబలగాల్లో పనిచేస్తున్న తన బావ, తల్లి ప్రవీణ్ మృతిపై అనుమానంతో తాము వచ్చే వరకు పోస్ట్‌మార్టం అభ్యంతరం చెప్పారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు భార్య లలితను విచారించగా సుపారీ హత్యగా తేలింది.

# సీఎం సభకు తరలిరావాలి

**చిగురుమామిడి మండలంలో బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం**


ఉల్లంపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ కొత్త వినీతాశ్రీనివాస్‌రెడ్డి

చిగురుమామిడి, అక్టోబర్ 12: ఈ నెల 15న హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలో జరిగే సీఎం కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభకు ప్రజలు భారీగా తరలి వచ్చి విజయవంతం చేయాలని బీఆర్ఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. అన్ని గ్రామాలకు మండల ఇన్‌చార్జిలను నియమించారు. అందులో భాగంగా ఉల్లంపల్లిలో ఎంపీపీ కొత్త వినీతా శ్రీనివాస్ రెడ్డి సర్పంచ్ చెప్యాల మమతతో కలిసి ఇంటింటికీ వెళ్లి సభకు తరలిరావాలని ప్రజలను కోరారు. సుందరగిరిలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, గునుకులపల్లిలో వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి, బొమ్మనపల్లిలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి, చిగురుమామిడిలో సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి, ఓగులాపూర్‌లో రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు సాంబారి కొమురయ్య, పీచుపల్లిలో మండల ఆర్గనైజింగ్ కార్యదర్శి చెప్యాల శ్రీనివాస్ గడపగడపకూ వెళ్లి సభకు రావాలని ప్రజలను కోరారు. అలాగే గాగిరెడ్డిపల్లిలో బీఆర్ఎస్ మహిళా మండలాధ్యక్షురాలు అందె సుజాత, సర్పంచ్ సన్నిల్ల వెంకటేశంతో కలిసి ఇంటింటికీ తిరిగి మహిళలకు బొట్టు పెట్టి సభకు ఆహ్వానించారు.